క్లుప్తంగా

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



గొలుగొండలో డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గొలుగొండ: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైద్య సిబ్బంది ఇచ్చే సలహాలను పాటించాలని గొలుగొండ, చీడిగుమ్మల వైద్యాధికారులు శ్యామ్, ధనుంజయ్, కీర్తి తెలిపారు. డయేరియా, డెంగ్యూ తదితర వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు గొలుగొండలో మంగళవారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సీజన్‌లో కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన, చికిత్స కోసం గ్రామాల్లో ఇప్పటికే పలు వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయంపై పార్టీల జెండాల తొలగింపు



టీడీపీ, జనసేన జెండాలు తొలగించాక లోవపొన్నవోలు సచివాలయం

మాడుగుల రూరల్: మండలంలోని లోవపొన్నవోలు గ్రామ సచివాలయంపై కట్టినటీడీపీ, జనసేన జెండాలను మంగళవారం తొలగించారు. నిబంధనల మేరకు ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ జెండా మినహా, మరే జెండాలు ఎగురవేయడానికి వీల్లేదు. దీనికి విరుద్ధంగా సచివాలయం మీద రాజకీయ పార్టీల జెండాల ఏర్పాటుపై సాక్షిలో వార్త ప్రచురితమయింది. దీనిపై స్థానిక ఎంపీడీవో ఆర్.కాళీ ప్రసాదరావు స్పందించి పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. పార్టీ కార్యకర్తలను పిలిపించి వెంటనే జెండాలను తొలగించారు. ప్రభుత్వ కార్యాలయంపై జాతీయ జెండా తప్ప మరే జెండాలు ఏర్పాటు చేస్తే సహించేది లేదన్నారు. ఇటు వంటి పొరపాట్లను పునరావృతం చేయొద్దంటూ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు సూచించారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



కరపత్రాలను అందిస్తున్న రూరల్ సీఐ హరి

గొలుగొండ: భారత రాజ్యాంగం, కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నర్సీపట్నం రూరల్ సీఐ హరి, కృష్ణదేవిపేట, గొలుగొండ ఎస్ఐలు ఉపేంద్ర, కృష్ణారావు తెలిపారు. మంగళవారం కృష్ణదేవిపేట, గొలుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ హరి మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు చట్టాలు అందరికీ సమానమేనన్నారు. చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉంటే, చాలా మోసాల నుంచి బయటపడవచ్చన్నారు. నూతన చట్టాలపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

6న దివ్యాంగుల సమావేశం

మాడుగుల రూరల్: మండల దివ్యాంగుల సమావేశం ఈ నెల 6న మాడుగుల దేవీ ఆలయంలో నిర్వహించనున్నట్లు మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతన ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లను రూ.3 వేలు నుంచి రూ.6 వేలుకు పెంచడంపై ప్రభుత్వానికి కృతజ్ఞత తెలిపేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరుకానున్నట్లు తెలిపారు.

ఏపుగా వరి నారు మడులు

మాడుగుల: మండలంలో ఈ ఏడాది ముందుగా కురిసిన తొలకరి వర్షాలతో రైతులు ఖరీఫ్ వరి నారు మడులు సిద్ధం చేసుకున్నారు. వరి నారులో యాజమాన్య పద్ధతులు పాటించడంతో ప్రస్తుతం నారు ఏపుగా ఎదుగుతున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల మేలు కోసం రెవెన్యూ సిబ్బంది పనిచేయాలి

- సమస్యల పరిష్కారానికి పదేపదే తిప్పించుకోవడం సరికాదు
- మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు



భూ సమస్యలపై సభలో తహసీల్దార్ రవికిరణ్‌ను నిలదీస్తున్న నిండుగొండ ఎంపీటీసీ

రోలుగుంట: రైతులకు మేలు చేసేలా రెవెన్యూ అధికారులు పనిచేయాలి తప్ప, సరైన పరిష్కారం చూపక, తమ చుట్టూ పదేపదే తిప్పించుకోవడం సరికాదని రెవెన్యూ అధికారులపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీడీవో జాన్ లింకన్, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన మండల సమావేశాన్ని నిర్వహించారు. శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలు వినిపించారు.

ఎంపీపీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులపై అధికారులు చొరవ చూపాలని హితవు పలికారు. రోలుగుంట, బుచ్చింపేట వైద్యులు ధనలక్ష్మి, సునీత సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, డయేరియా తదితర రోగాల కారకాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. పీఆర్ ఏఈ ఉమామహేశ్వరరావు సభ దృష్టికి వచ్చిన అసంపూర్తి భవనాలు, పెండింగు బిల్లుల మంజూరుపై సమస్యలను వివరించారు. జె.నాయుడుపాలెం, రోలుగుంట, నిండుగొండ ఎంపీటీసీలు జగది, కృష్ణ, గాలి ధర్మరాజు, కె.నాయుడుపాలెం సర్పంచ్ గుములూరి సన్యాసినాయుడు, లగుడు కృష్ణంనాయుడు భూముల రిజిస్ట్రేషన్, సర్వే, అడంగళ్‌లలో తలెత్తుతున్న సమస్యలపై అధికారులు సక్రమంగా స్పందించట్లేదని ఆరోపించారు. రైతులకు అర్థమయ్యేలా చెప్పట్లేదని, సమస్యల పరిష్కారానికి నెలలు, సంవత్సరాలు గడిపేస్తున్నారని ఆక్షేపించారు. తహసీల్దార్ రవి కిరణ్, కార్యాలయ సిబ్బందిపై తీరుపై మండిపడ్డారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో తాను లేనని, ఎన్నికల విధులపై వచ్చానన్నారు. సభ దృష్టికి వచ్చిన సమస్యల్ని వీలైనంత వేగంగా పరిష్కరిస్తానని, రైతులెవరూ ఆందోళన చెందనక్కర్లేదని భరోసానిచ్చారు. అధికారుల నివేదికల తర్వాత ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఏర్పడిన విభేదాలు పక్కన పెట్టి, నమ్మి గెలిపించిన ప్రజల కోసం గ్రామాభివృద్ధికి పార్టీలకతీతంగా కలిసి పనిచేద్దామని పేర్కొన్నారు. జెడ్పీటీసీ పోతల రమణమ్మ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో కలసి పని చేస్తానని తెలిపారు. సమావేశంలో మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చిన్నారుల్లో అతిసార వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం



అతిసారపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్య మేఘన, సిబ్బంది

దేవరాపల్లి: చిన్నారులు అతిసార వ్యాధి బారిన పడకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఇ.పూజ్య మేఘన సూచించారు. ఈ మేరకు దేవరాపల్లిలో అతిసార వ్యాధి పట్ల అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ర్యాలీలో అతిసార వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది నినాదాలు చేశారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే త్రాగించాలన్నారు. అనుబంధ ఆహారం అందించాలని, వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని సూచించారు. అంతకు ముందు స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. డయేరియా, మలేరియా, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్లోరినేషన్, యాంటీ లార్వా ఆపరేషన్, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో సీహెచ్‌వో పి.ప్రసాదరావు, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్, హెల్త్ అసిస్టెంట్ గోవింద్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాచిలవానిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి భారతి

కె.కోటపాడు: మండలంలోని పాచిలవానిపాలెంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ భారతి 122 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందుల్ని ఉచితంగా అందించారు. బీపీ, సుగర్ పరీక్షలతో పాటు గర్భిణులకు ప్రత్యేక తనిఖీలు చేశారు. నెలకు రెండు పర్యాయాలు నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి భారతి తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు, ఎంఎల్‌హెచ్‌పీ రేవతి, ఆశా కార్యకర్త నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కాలీఫ్లవర్ సాగుపై రైతుల ఆసక్తి



అర్లిలో సాగులో ఉన్న కాలీఫ్లవర్

కె.కోటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు కాలీఫ్లవర్ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ పంట సాగు ప్రారంభించిన రెండు నెలలకే దిగుబడి రానుండటంతో రైతులు సాగు పట్ల మక్కువ ప్రదర్శిస్తున్నారు. అర్లి, కె.సంతపాలెం, గవరపాలెం, దాలివలస, బొట్టవానిపాలెం, గొల్లలపాలెం, గొంపవానిపాలెం గ్రామాల్లో సుమారు 60 ఎకరాల్లో ఈ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట సాగు మొదలై 15 రోజులే అయిందని రైతులు చెప్పారు. ఎకరా పొలంలో పంట సాగుకు దుక్కులు, గొప్పులు, సస్యరక్షణ చర్యలు, కూలీల పెట్టుబడిగా రూ.20 వేల వరకు ఖర్చవుతుందన్నారు. కూరగాయల పంటలకు ప్రస్తుతం ధరలు బాగా ఉండటంతో పంట చేతికి వచ్చాక మంచి లాభాలు పొందగలమన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

పాల సంఘం అధ్యక్షుడిగా రామకృష్ణ



చీడికాడ: మండలంలోని మంచాల విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షుడిగా గ్రామ ఉపసర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత కశిరెడ్డి రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాల సంఘం పాలకవర్గంలో ఇద్దరు డైరెక్టర్ల పదవీ కాలం ముగియడంతో రామకృష్ణతో పాటు పార్టీ సానుభూతిపరులు కశిరెడ్డి వరలక్ష్మి రెండవ డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం డైరెక్టర్లు రామకృష్ణను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. దీంతో రామకృష్ణ మూడవ సారి అధ్యక్షుడిగా ఎన్నికైనట్లయింది. ఆయన ఎన్నిక పట్ల వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఎంపీపీ కురచా జయమ్మ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాకవరపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, పీహెచ్‌సీ సిబ్బంది

మాకవరపాలెం: సీజనల్ వ్యాధులపై ప్రజలపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు శ్రీవిద్య, సీతారామలక్ష్మి ప్రజలకు సూచించారు. డయేరియా, మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ, మానవహారంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చూడాలన్నారు. మలేరియా, డయేరియా లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతిపై వెళ్తున్న రమేష్‌కు సన్మానం



రమేష్‌ను దుశ్శాలువాతో సన్మానించి,జ్ఞాపికను అందిస్తున్న బ్రాంచ్ మేనేజర్ శ్రావణ్‌బాబు

కె.కోటపాడు: అంకిత భావంతో ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించిన వారికి ప్రజలతో పాటు ఉన్నతాధికారుల నుంచి తప్పక గుర్తింపు లభిస్తుందని చౌడువాడ ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ కె.శ్రావణ్‌బాబు అన్నారు. బ్రాంచ్‌లో క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.రమేష్ ఫీల్డ్ ఆఫీసర్‌గా పదోన్నతిపై శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బ్రాంచ్‌లో మంగళవారం సిబ్బంది, ఖాతాదారులు ఘనంగా సన్మానించారు. దుశ్శాలువా కప్పి, జ్ఞాపికను అందించారు. ఉత్తమ సేవలతో రాబోయే రోజుల్లో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని శ్రావణ్‌బాబు అభిలాషించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది అమర్‌నాథ్, సాంబిరెడ్డి, పాల సంఘం వేతన కార్యదర్శి చిన్ని వెంకట నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మోదమాంబకు వెండి చక్రం బహూకరణ



వెండి చక్రం అలంకరణలో మోదమాంబ

మాడుగుల రూరల్: మండలంలోని ఎం.కోడూరు మోదమాంబ అమ్మవారికి ఒకటింపావు కిలోల వెండితో తయారు చేసిన చక్రంను దాతలు మంగళవారం బహూకరించినట్లు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు తెలిపారు. గ్రామ మాజీ సర్పంచ్ కాటకోట సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయ కుమార్తె రాధ, స్థానిక టిఫిన్ సెంటర్ యజమాని రాజ్‌కుమార్, పడాల అప్పలనర్సయ్య(లాయర్) దంపతుల ఆర్థిక సహకారంతో ఈ వెండి చక్రాన్ని తయారు చేయించినట్లు వెల్లడించారు. దీన్ని అమ్మవారి తలపై కిరీటానికి వెనుక బిగించారు. ఈ సందర్భంగా దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఆశా కార్యకర్తలకు పారితోషికం చెల్లించాలి'



దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్యమేఘనకు వినతి పత్రం అందిస్తున్న ఆశా కార్యకర్తలు



చీడికాడ వైద్యులకు వినతి పత్రం అందిస్తున్న ఆశా కార్యకర్తలతో దేముడునాయుడు

దేవరాపల్లి/చీడికాడ: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన ఆశా కార్యకర్తలకు పారితోషికం చెల్లించాలని దేవరాపల్లి పీహెచ్‌సీ పరిధి ఆశా కార్యకర్తలు కోరారు. ఈ మేరకు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఇ.పూజ్య మేఘనకు మంగళవారం వినతి పత్రం అందించారు. ఎన్నికల రోజున పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌లలో ఆశా కార్యకర్తలకు డ్యూటీలు వేశారని, ఉదయం నుంచి ఎన్నిక ప్రక్రియ పూర్తయ్యే వరకు విధుల్లో ఉన్నామన్నారు. విశాఖపట్నం జిల్లాతో పాటు అనకాపల్లి జిల్లా సబ్బవరంలో రోజుకు రూ.200 చొప్పున పారితోషికం చెల్లించారని, మిగిలిన చోట్ల ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల మాదిరి తమకు కూడా పారితోషికం చెల్లించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పద్మ, సుజాత, వరలక్ష్మి, ఈశ్వరమ్మ, జ్యోతి, కమల తదితర ఆశా కార్యకర్తలతో పాటు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న పాల్గొన్నారు.

చీడికాడలో.. సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల వద్ద విధులు నిర్వహించిన ఆశా వర్కర్లకు పారితోషికాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి ఆర్.దేముడునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పలు జిల్లాల్లో రోజుకు రూ.200 చొప్పున పారితోషికాలు చెల్లించారని, అనకాపల్లి జిల్లాలో సబ్బవరం మినహా ఏ మండలంలోనూ చెల్లించలేదన్నారు. అధికారులు స్పందించి పారితోషికాలు వెంటనే చెల్లించాలన్నారు. ఈ మేరకు చీడికాడ, పెదగోగాడ ఆస్పత్రుల వైద్యులకు వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తల సంఘం నేతలు పాల్గొన్నారు.

ఆలయ భూముల వేలం మళ్లీ వాయిదా



దేవదాయ భూముల వేలం పాటలో పాల్గొన్న పాటదారులతో అధికారులు

రోలుగుంట: మండల కేంద్రం రోలుగుంట రెవెన్యూకు చెందిన దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధీనంలోని సీతారామ, వేంకటేశ్వర ఆలయాలకు చెందిన భూములకు కార్యనిర్వహణాధికారి (ఈవో) కె.బి.అశాజ్యోతి మంగళవారం వేలంపాటను నిర్వహించారు. పాటదారుల నుంచి నిబంధనల మేరకు ధరావతు సొమ్ము, వారి అధార్‌కార్డుల నకళ్లను తీసుకున్నారు. ఈవో ఆదేశాల మేరకు ఆ శాఖ ఉద్యోగి భాస్కరాచారి నియమ నిబంధనలను చదివి వినిపించారు. పాటదారులు గత పాట మాదిరిగానే మంగళవారం కూడా పాటను పెంచకపోవడంతో మళ్లీ వాయిదా వేసినట్లు ఈవో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారులకు ఈ విషయాలను నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం టెంపుల్స్ గ్రూపు పర్యవేక్షణాధికారి ఎస్.గంగారావు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు



పుష్పమ్మకు జీపీఎఫ్ చెక్కును అందిస్తున్న వైద్యులు ప్రసాదుపాత్రుడు, లీలాప్రసాద్

మాడుగుల రూరల్: ఉత్తమ సేవలు అందించే ఉద్యోగులకు సమాజంలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని కేజే పురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్‌వీఎస్ఎస్ ప్రసాదుపాత్రుడు తెలిపారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన కేజే పురం పీహెచ్‌సీ సీహెచ్‌వో చింతాడ పుష్పమ్మకు మంగళవారం పీహెచ్‌సీ ఆవరణలో ఘనంగా సన్మానించారు. పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన వీడ్కోలు సభలో వైద్యాధికారులు ప్రసాదు పాత్రుడు, లీలాప్రసాద్ మాట్లాడుతూ పుష్పమ్మ సేవల్ని కొనియాడారు. స్థానిక సర్పంచ్ జామి రమణబాబు, పంచాయతీ వార్డు సభ్యులు సూరిశెట్టి గోవిందరాజులతో పాటు బుడబండి రాజు, విశ్రాంత డీపీఎం చిన తిరుపతి, ఆరోగ్య సహాయకుడు పేర్ని శంకర్ తదితర్లు ఆమె అందించిన సేవల్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పుష్పమ్మ, ప్రసాద్ దంపతులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందించారు. పుష్పమ్మకు జీపీఎఫ్ చెక్కును వైద్యులు ప్రసాదుపాత్రుడు, లీలాప్రసాద్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, స్థానిక పెద్దలు, పుష్పమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గౌరవం



విశ్రాంత హెచ్‌ఎం శాంతికుమారి దంపతులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నాతవరం: సమాజంలో అందరిమన్ననలు పొందేలా విధులు నిర్వహించే ఉద్యోగులకు ఎల్లప్పుడూ గౌరవం ఉంటుందని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స అన్నారు. మండల కేంద్రం నాతవరం హైస్కూల్లో హెచ్‌ఎం ఎస్.శాంతికుమారి పదవీ విరమణ చేయడంతో, మంగళవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆమె సేవల్ని కొనియాడారు. సమాజంలో గౌరవమైన ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పనిచేస్తే వందల మంది విద్యార్థుల మనసులో సుస్థిర స్థానం సంపాదించవచ్చన్నారు. అనంతరం శాంతికుమారి దంపతులను ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాతవరం సర్పంచ్ గొలగాని రాణి, ఎంపీటీసీ సభ్యులు కరక రేణుక, చెక్కా ప్రభావతి, మాజీ ఎంపీపీలు నేతల విజయకుమార్, పారుపల్లి కొండబాబు, నాతవరం ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు, విశ్రాంత ఎంఈవో తాడి ఆమృత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు పైల పోతురాజు, హైస్కూల్ విద్యా కమిటి మాజీ చైర్మన్ రెడ్డి వరహాలబాబు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూండ్రపు సత్యనారాయణ, జిల్లా కమిటి సభ్యుడు ఎస్‌వీఎస్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

గ్రామ సభల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



విలేకరులతో మాట్లాడుతున్న ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు రమణ

దేవరాపల్లి: రాజ్యాంగ నిబంధనల మేరకు జరిపించాల్సిన గ్రామ సభల పట్ల అధికార్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రం దేవరాపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేజర్ పంచాయతీ దేవరాపల్లిలో ప్రజలకు కనీస సమాచారం లేకుండా గ్రామ సభ నిర్వహించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. గ్రామ సభకు మూడు రోజులు ముందుగా గ్రామంలో దండోరా, ప్రధాన కూడళ్లలో పోస్టర్స్ అతికించి ప్రజలకు తెలపాలన్నారు. పంచాయతీలో అవినీతి, అక్రమాలు బయట పడతాయన్న భయంతోనే అధికార్లు గుట్టు చప్పుడు కాకుండా గ్రామ సభ నిర్వహించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ప్రజలు లేకుండా గ్రామ సభ నిర్వహించడంతో ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలకు ముందస్తు సమాచారం ఇస్తూ, మళ్లీ గ్రామ సభ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కొరుపోలు శ్రీను, మండల సభ్యులు చొక్కాకుల రమణ, గంగవంశం సంతోష్, రంది వెంకటరమణ తదితర సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



డయేరియా మాసోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం: ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. డయేరియా నిర్మూలన మాసోత్సవాలను గవరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆయన ప్రారంభించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అంటు రోగాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. మాసోత్సవాల సందర్భంగా గవరవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ర్యాలీని ఎమ్మెల్యే రాజు ప్రారంభించారు. అక్కడి నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా గ్రామ వీధుల్లో ర్యాలీ జరిగింది. డయేరియా, టైఫాయిడ్, మలేరియా, ఇతర సీజనల్ రోగాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు, మాజీ సర్పంచ్ చప్పగడ్డ అప్పలనాయుడు, మండల అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా నువ్వు పంట సాగు



పూత దశలో ఉన్న నువ్వు చేను

నాతవరం: మండలంలో ఈ ఏడాది నువ్వు పంట ఆశాజనకంగా ఉంది. గత ఏడాదితో పోల్చుకుంటే నువ్వు పంట సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు సకాలంలో పంట వేసుకున్నారు. మండల వ్యాప్తంగా 922 ఎకరాల్లో నువ్వు పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం నువ్వు చేను పూత దశలో ఉండగా, కొన్ని చోట్ల పంట దశకి కూడా చేరుకుంది. నువ్వులు ధర కూడా మార్కెట్లో క్వింటా రూ.10 వేలకు పైగా పలుకుతోంది. మరో 20 నుంచి నెల రోజుల వ్యవధిలో పంట చేతికందే అవకాశం ఉందని రైతులు చెప్తున్నారు. పంట దిగుబడి బాగుంటే, ఆ ఆదాయంతో ఖరీఫ్ సాగు పెట్టుబడి ఇబ్బందులు తప్పుతాయని రైతులు ఆకాంక్షిస్తున్నారు. నువ్వు చేనులో రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవడంతో ఆశించిన విధంగా చేను ఏపుగా పెరిగి, పూత, కాపు దశకు చేరుకుందని వ్యవసాయాధికారులు చెప్తున్నారు.